మొయిలు

అవతల పెద్దమనిషి నామీద ఆపేక్షగానే పలుకరించాడు: నేనూ, చాలా మర్యాదగానే సమాధానం చెప్పాను. కాని; వినీ వినడంతోనే, కొంప మునేంత కోపం రిమ్మ ఎత్తుకు వచ్చింది ఆయనకు: "నీ కింత తలపొగరా" అన్నంత కొరకొరగా చూశాడు: తిట్టబోయేంత దూకుడులో దౌడలు ఆడించాడు: కాని, ఏమనుకున్నాడో ఏమో, అనబోయేవన్నీ దిగమ్రింగుకుని, — కాల్చేట్టూ,

"ఏం భాషరా అది?" అని మటుకు అని ఊరుకున్నాడు:

నేను తెల్లమొగం వేసినట్టు, "ఏం!" అనేది తడబడుతూ ఉచ్చరించి— "తెలుగే, మన తెలుగే!" అన్నాను:—

ఆ సౌమ్యుడు తిక్క అదమాయించుకుంటూ "ఆలాగేం?" అంటూ మెడ బెడికేంత రివ్వున రుంజుకుని, నా మొగం చూడటానికి తనకువేసే అసహ్యం యావత్తూ అడుగులు తాటించటంలో తాహతు మేరకు ప్రదర్శిస్తూ, కళ్ళముందునుంచీ, ఏతావతా కథలోంచి నిష్క్రమించాడు—

పోతే పోయినాడు! మనకేం విచారంలేదు! ఆ పెద్దమనిషికి యీ కథతో యిక ఏమీ ప్రమేయంలేదు.

కాగా, అసలు సంగతి ఏమిటంటే, అతడు నన్ను, అడిగిందేమిటి, నేను చెప్పిందేమిటి, అందులో ఏమున్నా పొల్లుందా, ఏమన్నా తూలానా? సంగతేమిటో చివరకు తేలుతుంది—

వెనుకటికి ఒకసారి మనవాడికి ఒకడికి యిల్లాంటి చిక్కే వచ్చింది. అది అనవసరంగా లాభించింది.

మనమూ ఆ నోమే పడితే, మన చేతి రాయికూడా, ఎన్నడన్నా, తగిలితే అలాగే నాలుగురాళ్ళు రాలకపోవు కదా, అని మానవసహజమైన ఆశ! అలా అనుకునే, అనే, ఇంతకుముందు, ఆ గృహస్థుతో పేచీ తెచ్చుకుంది.

మనవా డన్నానే, వాడికీ ఎత్తుగడ యిలాగే ప్రారంభం అయింది:

తలవంచుకుని, తన మానాన, తన త్రోవను తాను పోతున్నాడు. అదే తరుణానికి, ఆ పక్క దాబాలోంచి, ఆవిడ, చేటలో కూరచెక్కలు వీధిలో పారవేయ డానికి అరుగుమీదికి వచ్చింది. వీడిని చూసి. పాపం, మర్యాదగానే, ఆపేక్షగానే పలుక రించింది. వీడూ అలాగే జవాబు చెప్పాడు.

వినీ వినడంతోనే, ఆవిడమటుకు ఎంగిలి విస్తరిమీదకు కొట్టుకు వచ్చినట్లు ఎగిరి వెనుకకు ఒక్క గంతువేసి, తలుపు పగిలేటట్టు విసిరికొట్టింది.

ఈవిడ ఈ అఘాయిత్యమేమిటో వీడికి అర్థం కాలేదు. తాను ఏమన్నాడని? అన్నదాంట్లో తప్పు ఏమన్నా ఉందా!, ప్చ్?—ఏమిటో అర్థం కాలేదు.

ఆలోచించి చూసి, ఒక్కటే అనుకున్నాడు- ఈ బెడదకంతకూ మూలకారణం వీరేశలింగం పంతులుగారు బ్రతికి ఉండకపోవడం !—

....వయోధర్మాన్ని పట్టి చూసినా, మాంచి ఉమ్మసంమీద ఉంది: అందరు అమ్మలక్కలు లాగానే మూడు పువ్వులూ ఆరు కాయలుగా కాపురం చేస్తూండవలసిన ఈడు.

ఆ ముద్దూ ముచ్చటా ఏమీ కొనసాగకుండా, ఆ చిన్నదాని బ్రతుకు అలా అయిపోవడం, అయిపోయినదానికి వగపేమిటికని, గుండె రాయి చేసుకుని, ఆ చిన్న దాని గొంతుక్కు మరో మూడు ముళ్ళు వేయించే దక్షుడు అంటూ లేకపోవడం, ఏతావతా ఆ జీవితం అలా నిప్పచ్చరమైపోయి, వంటయింటి పాలైపోవడం, ఆవిడ ఆ కారణంగా ఛర్‌ర్‌మన్నదంటే, మన వాడికి ఆశ్చర్యం వేయలేదు, పాప మనిపించింది, ఆ బ్రతుకుమీద జాలేసింది.

వెనుకటికి, మహర్షులకు కరవాచ్చేంత కోపం ఉండేదంటే, ఇదే కారణం అయివుంటుంది: ఇదే అంటే, ఆ ఇనుప కచ్చడాలే!

—మేము యిద్దరమూ వాడిగదిలో కూచుని, ఈ విషయమే అనుకుంటు న్నాము : ఇంతలోకే ఆయన చక్కా వచ్చాడు.

ఆయన అంటే, ఓ పెద్దమనిషి. కులగోత్రాలు ఎన్నవలసిన అగత్యంలేదు. సిజావైన సదా కోటిలింగాల్లో, ఇదో అంకె!—

ఎందుకు వచ్చాడు? వీడితో పోట్లాడడానికి. అది స్పష్టంగా కనిపిస్తూనే వుంది. ఆ రావడంలో, ఆ కూచోడంలో, ఆ దూకుడంతా?

పోట్లాటదేనికి?, వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకున్నారు. ఎవర్ని గురించో తెలిసింది కాని, అసలు కిటు కేమిటో అంతు చిక్కలేదు.

"నీ వలా అనడం మర్యాదా?" అన్నాడు ఆ పెద్దమనిషి. ఆవిడను ఏదో వీడు అన్నాడని, వెనకేసుకు వచ్చాడు.

మనవాడు, జవాబు చెప్పేముందు తొణక్కుండా కొంచెం నిదానంగా ఆలోచించాడు.

"ఆవిడను నేను ఏదో అంటే, మీకు కోపం రావడానికి కారణం?" అని పాఠం చెప్పినట్టు పరకాయించి అడిగాడు. ఆ నోట, తడుముడే తప్ప, సమాధానం వెంటనే పెగిలింది కాదు.

"ఏమిటి ఈ సంబంధం!" అని తనలో తాను అనుకున్నాడు వీడు.

వచ్చిన పెద్దమనిషి గట్టి యిరకాటంలో పడ్డట్టుంది వైఖరి. నా వంక చూసి, ఆ చూపే వీడివంక చూసి, "నీతో అయిదు నిమిషాలు ఒంటరిగా మాట్లాడుదామని వచ్చాను" అని నసిగాడు.

వీడు, "ఓ!" అన్నట్టు మొగం కోలచేసి, "రాగానే ఆ మాట చెప్పకపోయినారా? సరే ఒంటరిగా అంటే ఒక్కటే చిక్కు - ఉనికీ మనికీ ఉన్నది ఒక్కటే గది. మనం బయటికన్నా పోవాలి, వచ్చిన స్నేహితుణ్ణయినా ఇక్కడనుంచి తరిమి వేయాలి...."

"మీరు కూచోండి. నేను మళ్ళీ వస్తాను" అని లేవబోయినాను. వీడు నన్ను కూలేశాడు.

"అలా కాదులే, ఎందుకైనా మంచిది, రోడ్డు ఎక్కితే, ఉభయులం నిర్మొగమాటంగా మాట్లాడుకోవచ్చును. నీవు కూడా!" అంటూ యిద్దరూ కలిసి వెళ్ళిపోయినారు—

నాకు ఇంపాకటినుంచీ ఒక్క ముక్క అర్థంకాలేదు, వీళ్ళిద్దరిమధ్యా పేచీ, ఏమిటో ఎందుకొచ్చిందో? వీడు సాధారణంగా ఓ జోలికీ శొంఠికీ అనవసరంగా పోడు. కావాలని చెయి చేసుకుంటే తాతలు దిగివచ్చినా వెసగడు. అసలు ఏమిటి సంగతి?—

ఇంతలోకే వీడూ తిరిగి వచ్చేశాడు. పట్టపగ్గాలు లేనంత సంబరంతో వచ్చాడు. గది అంతా కలయ దిరుగుతూ మౌనంగా వెక్కి వెక్కి నవ్వుకుంటున్నాడు.

నా మొగమంతా ప్రశ్నల్లే చేసుకు కూర్చున్నాను! ఒకటి రెండుసార్లు నా వంక మిడిమిడిగా చూశాడు. కొంచెం బిగ్గిరిగా నవ్వుకున్నాడు.

"లే—కాఫీ త్రాగుదాం!—"

నోరెత్తకుండా వాడివెంట నడిచి వెళ్ళాను, ప్రశ్నను మ్రింగేసుకుంటూ.

ఇంకో అరగంటకు అసలు సంగతేమిటో చెప్పాడు.

ఓ వెయ్యి రూపాయలు లంచం యిచ్చి, వీడి నోరు కట్టేసి వెళ్ళాడు ఆ పెద్ద మనిషి—

ఎందుకూ?—

అందుకే, ఆ సంగతి వీడికి తెలిసినందుకే!—

—ఆవిడ కడుపుతోవుంది. కన్నది! అంతా గుప్‌చిప్‌గా జరిగింది! అది ఎలాగో వీడికి తెలిసింది—

"నీకు ఎలా తెలిసిందిరా! సప్తప్రాకారాల లోపల సంఘటన? పైగా ఆరు మాసాలనుంచీ నీవు ఊళ్ళో లేకనేపోతివి. మాకు ఒక్కళ్ళకూ తెలియదే, ఎక్కడా పొక్కందే!"

"ఒరేయ్! ఆ ప్రశ్నలన్నీ ఆ పెద్దమనిషి అడగవలసింది; నీ కెందుకురా?-"

"....పోనీ ఎలా తెలిసిందో చెప్పరా బాబూ, ఏమన్నా అంజన ప్రభావమా?"

...."అంతేననుకో; రవి కంటపడని సంగతులు, కవి కంటపడతాయ్ అన్న ముసలివాళ్ళు వెర్రివాళ్ళా? నాకు తెలుసునని వాళ్ళకు నమ్మకం, నేను కాదంటే ఏం లాభం? ఆ నాలుగురాళ్ళూ దక్కకుండా పోవడమేగా!"

"నీ వనేదేమో నాకు అర్థం కావడంలేదు."

"ఆయన వచ్చి కదలేసేదాకా నాకూ అర్థంకాలేదు. ఆ మానవుడి తత్తరపాటులో

నాకు చూచాయగా కీలకం అందింది. వట్టి బుకాయింపుమీద నెట్టుకు వచ్చాను, పాచిక రంచన్‌గా పారింది—"

"అంతే? - ఇంతకూ నీవు ఆవిడను ఏమన్నావ్?"

...."ఏ సుముహూర్తాన అన్నానో, ఆ ఒక్క ముక్క అక్షర లక్షలంత పని చేసింది. బిడ్డకన్న విశ్వస్థమొగం చూడటం అంత యోగప్రదమని నాకు యిదివరకు తెలియదు సుమీ అబ్బీ!"

...."ఇంకా సాగదీయక, ఆ ఒక్కముక్క ఏమిటో చెపుమా...."

"చెపుతూంటినిగా"....

"అవాళ నేను రైలుదిగి బండిలో వస్తున్నాను. ఈవిడ మేడ వసారాలో నీరసంగా నిలుచుని ఉంది. ఆవిడ ఆరోగ్యంతో మనకు అంత ప్రసక్తి లేదుకనుక నేను ఆ విషయం అప్పుడంత పరకాయించలేదు. ఆవిడమీద మనకు ఎలాటి ధ్యాస ఉండటం అలవాటు లేదాయెను. అందుకని, అవాళ ఆవిడ కనపడ్డ సంగతే చప్పగా మరచి పోయినాను..."

"....ఉపోద్ఘాతం పేనేస్తున్నావు...."

"కొంచెం ఓపికపట్టు, అసలుకాండకు యిదే ఆయువుపట్టు...."

"అవాళటికి — మళ్ళీ — యివాళ కనిపించింది - పలుకరించింది - అందులో తప్పేంలేదు - ఎబ్బెరికమూ లేదు - "ఏమయ్యా ఎప్పుడు రావడం—" అంది. నేనూ సజావుగానే సమాధానం చెప్పాను - చెప్పాననే అనుకున్నాను—"

"నేను కానిమాట ఏం అనలేదు సుమీ - "మీరు కన్నప్పుడేనండీ!—" ఇంతే నా జవాబు. ఆవిడ, వినీ వినడంతోనే రగిలిపోయి, తలుపు ధణాయించింది కదా!—"

"నేను అనాలని అనలేదు. అనడంలో ఎలాటి చెడు ఉద్దేశమూ లేదు - కాని, ఎందుకు అన్నానా?—నా అవస్థ మనవి చేస్తాను."

"అంతకుముందు కొన్ని గంటలనుంచి కవిచౌడప్ప పద్యపాదం ఒకటి నన్ను పట్టుకు గుక్క తిప్పుకోకుండా వేధిస్తూంది - ఇదోయ్ - "కన్నపుడు — "ఈ పద్యం నీకూ వచ్చుకాదూ?—"

"ఆవిడ నన్ను పలుకరించడంతోనే జవాబుక్రింద ఆ ముక్కే తోసుకువచ్చింది. నేనైతే ఆ వంక చూశాను కాని, నన్ను యీఏడ చూసి వుంటుందా లేదా అనే ఆలోచ

నన్నె రాలేదు - ఉన్నమాట అలాగ్గా అనేశాను. అ మాటకు నానార్థాలు ఉండటంతో, కథ యిలా సాగింది—"

"చీకటిలో చేసిన తప్పుడుపని — పైగా, తాత్కాలికంగా కళ్ళు మూసుకుపోయి కూడా చేసిందేమో, నేను అలా అనడంతో, నేను పసికట్టానని గంగవెర్రు లెత్తి పోయింది - ఆవిడ కష్టానికీ సుఖానికీ అక్కరకు వచ్చింది, ఆ పెద్దమనిషే. ఉభయులూ కూడబలుక్కున్నట్టున్నారు: ఎలాగైనా నా నోరు కట్టివేయాలని వచ్చాడు—"

"ఆయన చెప్పిందంతా విన్నాను - వినగా వినగా నాకే జాలేసింది: ఆ అమర్దా చూసి, పట్టుకు తన్నాలనిపించింది — అసహ్యం వేసింది—"

"నిజం చెప్పాను - కాని, ఆయన నమ్మలేదు: మొర్రో నాకేం తెలియదు — మీరేగంగలో కలిస్తే నాకేం - అని నేను అన్నకొద్దీ - నేను ఖచ్చితంగా అబద్ధం ఆడుతున్నాననీ, నాకు అంతా తెలుసుననీ ఆయన మొరాయించాడు: ఎలాగైనా పరువు నిలపమని ప్రాధేయపడ్డాడు - అలాటి క్లిష్టపరిస్థితిలో - ఎదట ఆసామీకన్న ఇను మిక్కిలిగా, నేను ఇరకాటంలో పడ్డాను — కాదనలేకపోయినాను-ఇందులో నా దోషం అణుమాత్రమైనా ఉందంటావా!"

నేను, అంతా విని ఏమంటానో అని, నా వంక పరకాయించి చూస్తున్నాడు, వీడు: అనడానికి ఏం ఉంది? - మనసు ఉండబట్టలేక ఆ వయసులో ఆవిడ అలా చాటుగా మాటుగా ఓ మాటో అరమాటో సుఖపడ్డది - అంతకు ఇనుమిక్కిలి గాభరా, గంద్రగోళం పడ్డది - అది చివరకు ఇలా వీడికి యోగించింది! ఇందులో నేను అనేందుకు ఏముంది?—

నేను నా ఆలోచనలో మౌనంగా ఉండటం చూసి, వీడు అందుకున్నాడు -

"ఇన్నాళ్ళకు తెలివి వచ్చిందిరా అబ్బీ! గ్రాంధికభాషలో ఏదో యోగం ఉండ బట్టే — వెనుకటి కొమ్ములు తిరిగిన కవులందరూ, దీన్ని పట్టుకు పాకులాడారు: వాళ్ళకూ తప్పకుండా లాభించే ఉంటుంది—"

"ఒరేయి, నీ వనేదాంట్లో సబబులేదు—"

"ఉంది, నేను అనే దేమిటో నీకు విపులంగా అర్థం కాలేదు. వ్యావహారికభాష అయితే ఎంతసేపూ ముక్కుకు సూటిగా పోవడమేనాయెను: అందులో మట్టుకు ఒక్కటే అర్థంకాని, ఇన్ని తికమకలు లేవుకదా! - నాకు ఏం తోస్తూన్నదంటే,

చూడగా చూడగా, మనం అనుకున్న అర్థం ఒకటి, అవతలవాడికి అయే అర్థం ఒకటి - అలా అయినప్పుడే ఎన్నడైనా ఫలంపాటు! — ఒక్క గ్రాంథిక భాషకే ఆ సత్తా ఉన్నదని — రుజువైందికద! — ఇకనుంచీ — ఈ క్షణాన్నుంచీ మనం గొడ్డు గ్రాంథికులం! —"

"సరేలేరా — వాళ్ళను ఇంతటితో వదిలినట్టేనా? —"

"ఆవిడ కడుపు చల్లగా - నేను వదిలినా వాళ్ళు నన్ను వదులుతారా? — అభ్యాసం కూసువిద్య కాదుటోయ్ - ఇన్నాళ్ళకు దోవలోకి వచ్చిన తరువాత - మళ్ళీ ఆ ఇల్లాలు మడిగట్టుకు కూచుంటుందంటావా? — ఆవిడకు ఏం అగత్యం! - ఇలాగే దైవం చల్లగా చూస్తే - ఏపేటా, ఆవిడ ఎంగిలి పడనూవచ్చు - పాతికో - పరకో పెట్టి - పరువు ఏకోసాల్‌గా కొనుక్కోనూవచ్చు! - మనకు, కొన్ని ఏళ్ళదాకా ఈ వార్షికాలు తప్పవేమో అనిపిస్తోంది!"

"ఇది పరువే నంటావా? - ఈ సంపాదన!"

— "ఇది కేవలం భాషకు సంబంధించిన విషయం — ఇందులో మంచి చెడ్డలు నిర్ణయించవలసింది ఏ సాహిత్య పరిషత్తో కాని - మనం కాదు - మనకు కావలసిందల్లా యింతే - భాషను నమ్ముకున్నందుకు - ఏదో రూపేణా పోషణ జరిగేటట్టు - ఆ దేవి అనుగ్రహించింది - ఇక తర్కం చాలిద్దాం - ఈ డబ్బులు ఖర్చయేదాకా - నాకు చేదోడుగా ఉండు! —"

* * *

ఈ తతంగం జరిగి ఇప్పటికి చాలారోజులైంది. డబ్బు ఏనాడో ఖర్చు అయిపోయింది - కథ పాతపడిపోయింది - కాని, ఆ ప్రయోగం మాత్రం మనసు అట్టడుగునే మౌనంలో పడిపోయి ఉండాలి! —

ఆవాళ నన్ను ఆయన పలుకరించి - "ఎప్పుడు రాక" అని అడగటం - నేను ఉన్నట్టుండి - "మీరు కన్నప్పుడే!" అనడం - ఆయన ఆ మాటకు మొగం కండలు చించుకోవడం — నేను ఉలిక్కిపడటం — ఈ రంధి కంతా అదీ కీలకం—

గ్రాంథిక ప్రయోగం చేసినందుకు — అవతల మనిషి సౌమ్యుడు గనుక - అంతటితో విడిచిపెట్టాడు - నా జాతకరీత్యా - అంతే యోగం అనుకోవాలి! —

●